క్లుప్తంగా

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు నియామకం



వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేస్తున్న డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న

పెన్‌పహాడ్ : మండలంలోని గాజులమల్కాపురం గ్రామానికి చెందిన మామిడి వెంకటేశ్వర్లును కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన వెంకటేశ్వర్లుకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, యువనేత రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్, డీసీసీ సభ్యులు కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, పీసీసీ కార్యదర్శి తూముల భుజంగరావు, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

చివ్వెంల : మండల పరిధిలోని దురాజ్‌పల్లి గ్రామశివారులో గల ఆలేటి ఆటం అనాథాశ్రమంలో శనివారం సూర్యాపేట పట్టణానికి చెందిన నిహారిక అఖిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతలు పిట్టల ఉమామహేశ్వరీ సైదులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 67మంది మానసిక దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వీరయ్య, లక్ష్మి, అఖిల్, కవిత, నిహారిక, కృష్ణ పాల్గొన్నారు.

భేరీలు, గజ్జెలు అందజేత



యాదవులకు భేరీలు, గజ్జెలు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని తాళ్లసింగారంలో ఆదివారం నిర్వహించే సొడమ్మ జాతర సందర్భంగా యాదవులకు బీఆర్‌ఎస్ నాయకులు భేరీలు, గజ్జెలను శనివారం బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చూడి లింగారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ ఆదేశాల అనుసారం యాదవులకు రూ.23వేలు విలువ చేసే మూడు భేరీలు, 13జోళ్ల గజ్జెలు పెద్దగొల్ల జటంగి వెంకన్నకు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రైతు విభాగం మండల అధ్యక్షుడు పన్నాల సైదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ మట్టపల్లి గంగయ్య, తాడూరి సైదులు, మద్ది ఉప్పలి, గుండు లింగయ్య, గుర్వయ్య, వెంకన్న, శ్రీహరి, గుర్వయ్య తదితరులు పాల్గొన్నారు.

భరోసా సభను విజయవంతం చేయాలి

అర్వపల్లి : హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నేడు (ఆదివారం) నిర్వహించే తెలంగాణ భరోసా సభను విజయవంతం చేయాలని బీఎస్పీ మండల అధ్యక్షుడు చెర్కుపల్లి లక్ష్మణ్ కోరారు. శనివారం మండల కేంద్రంలో భరోసా సభను విజయవంతం చేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సభను బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు, సభకు బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు శతకోటి కోటేశ్వర్, జీడి వెంకన్న, చెర్కుపల్లి ప్రశాంత్, జె.ఆంజనేయులు పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నూతనకల్ : మండల కేంద్రంలో ఈనెల 10న నిర్వహించే ప్రజాకళాకారుడు అరుణోదయ రామారావు 4వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు కోరారు. శనివారం మండల కేంద్రంలో వర్ధంతి సభకు సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలను తమ పాటల రూపంతో గలమెత్తి ప్రజలను చైతన్యవంతులను చేసి పీడిత ప్రజల పక్షాన చివరి వరకు పోరాడిన మహాగాయకుడని ఆయన తెలిపారు. ఈ సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జటంగి వీరమల్లు, భరత్, గడ్డం శ్రీను, సంజీవ, లింగయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్ల పంపిణీ ఎప్పుడో?

- నిర్మాణాలు పూర్తయి సంవత్సరం కావస్తున్నా పంపిణీలో జాప్యం
- ఇళ్ల మధ్యలో పెరుగుతున్న కంపచెట్లు
- ఆశగా ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు
- పట్టించుకోని అధికారులు



మద్దిరాలలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూం ఇళ్లు

మద్దిరాల : పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తైనా పంపిణీకి మాత్రం నోచుకోవడంలేదు. అధికారుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులకు ఎదురుచూపులు తప్పడం లేదు. పూరిగుడిసెల్లో, కిరాయి ఇళ్లలోనే మగ్గుతూ ఎప్పటికైనా ఇళ్లు ఇవ్వక పోతారా? అని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి 8సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు పంపిణీ నోచుకోకపోవడంతో దరఖాస్తుదారులు ఎప్పుడు పంపిణీ చేస్తారో అని వెయ్యికండ్లతో ఎదురుచూస్తున్నారు. మద్దిరాలలో మొత్తం 75డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి 2015 నవంబర్‌లో భూమి పూజ చేసి పనులను చేపట్టారు. ఒక్కో ఇంటికి రూ.5.4లక్షలు కేటాయించి మొత్తం 75ఇళ్లకు రూ.3.78కోట్లను కేటాయించారు. దాదాపు 8సంవత్సరాలు గడిచినా ఇళ్ల నిర్మాణం పూర్తైనా ఇప్పటికీ పంపిణీ చేయడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. నిర్మాణాలు పూర్తయి సంవత్సరం గడుస్తున్నా పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల మధ్య కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. అధికారులు వెంటనే స్పందించి అర్హులైన వారిని గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలని కోరుతున్నారు.

ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు..

గ్రామంలో మొత్తం 75డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించారు. ఈ ఇళ్లకు గ్రామం నుంచి చాలా మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇటీవల అధికారులు గ్రామంలో పర్యటించి కొంత మంది అర్హులను గుర్తించి నివేదికను జిల్లా అధికారులకు అందజేశారు. కాని ఇప్పటికీ ఉన్నతాధికారులు ఎలాంటి అర్హుల జాబితాను వెలువరించలేదు. వారి నుంచి తుది జాబితా రాగానే అర్హులకు ఇళ్లను అందజేస్తామని అధికారులు అంటున్నారు. దరఖాస్తుదారులు మాత్రం త్వరగా ఇళ్లను అందజేసి సొంతింటి కలను నేరవేర్చాలని ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలి



డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టి 8సంవత్సరాలు గడిచినా కూడా ఇంత వరకు వాటిని అర్హులకు అందజేయలేదు, అధికారులు వెంటనే స్పందించి లబ్ధిదారులను గుర్తించి ఇళ్లను పంపిణీ చేయాలి, లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ఇళ్లను పంపిణీ చేస్తాం.

– ముక్కాల అవిలమల్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు, మద్దిరాల

త్వరలోనే పంపిణీ చేస్తాం



డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల గ్రామంలో అర్హుల ఎంపిక కోరకు జిల్లా అధికారులు ఇతర మండలాల అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారు. ఆ అధికారులు గ్రామంలో పర్యటించి దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి అర్హుల జాబితాను తయారు చేసి జిల్లా అధికారులకు అందజేశారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు అతి త్వరలో లబ్ధిదారులను గుర్తించి పంపిణీ చేస్తాం. – అమీన్‌సింగ్, తహసీల్దార్, మద్దిరాల

‘మన ఊరు–మన బడి’ పనులు పూర్తిచేయాలి



పనులపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు

ఆత్మకూర్–ఎస్ : మండలంలోని ఆయా గ్రామాల్లో మన ఊరు–మన బడి పథకం కింద మంజూరైన పనులు వెంటనే పూర్తి చేయాలని మండల విద్యాధికారి ఎం.ధారాసింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మన ఊరు–మనబడి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాఠశాలలు పునః ప్రారంభమయ్యేలోపు పాఠశాలల్లో అన్ని పనులు పూర్తిచేసి విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో, ఆధునిక వసతులతో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అధిక శాతం పాఠశాలలో మరుగుదొడ్లు, ప్రహరీలు, వంటగదుల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని సర్పంచ్‌ల సహకారంతో వెంటనే పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ మాల్సూర్‌నాయక్, పంచాయతీరాజ్ ఏఈ బాబురావు, హెచ్‌ఎంలు శంకర్‌నాయక్, వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ వరికుప్పల వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని టేకుమట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి అధికారులు లారీలు పంపించకపోవడంతో ధాన్యం కాంటాలు నిలిచిపోయాయి. దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని శనివారం పలువురు రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. కలెక్టర్ వెంటనే తగిన చర్యలు తీసుకొని రైస్ మిల్లుల యాజమాన్యాలు తాలు, తడిసిన ధాన్యం పేరుతో కొర్రీలు పెడుతూ ధాన్యం దిగుమతి చేసుకోకపోవడంతో లారీలు రాక కాంటాలు వేయని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే పురుగుల మందే దిక్కని రైతులు వాపోతున్నారు. అధికారులు రైస్ మిల్లర్లతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు వేడుకుంటున్నారు. ఆందోళనలో రైతులు రాములు, దేవయ్య, పద్మ, సందీప్, నాగయ్య, సైదులు, బుచ్చిరాములు పాల్గొన్నారు.

రైతులపై ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వీడాలి



ధాన్యాన్ని పరిశీలిస్తున్న కొత్తపల్లి శివకుమార్

సూర్యాపేట రూరల్ : రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడి ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యాన్ని యుద్ధ ప్రాతిపదికన కొనుగోలు చేయాలని ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ప్రజాపంథా 22వ రోజు ప్రజాపోరు యాత్రలో భాగంగా మండలంలోని బాలెంల, రామన్నగూడెం గ్రామాల్లోని ఐకేపీ సెంటర్ల వద్దకు వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు రాత్రింబవళ్లు రాశుల వద్ద కాపులపడాల్సి వస్తుందని, భారీ వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా రైతులు తీసుకునే చర్యలు సరిపోవడం లేదన్నారు. అదే విధంగా మిల్లర్లు తేమ పేరుతో రెండు నుంచి 6కిలోల వరకు తరుగు తీస్తున్నారని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి ఎలాంటి తరుగు తీయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి కేంద్ర ప్రభుత్వం రూ.30వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి రామోజీ, పీడీఎస్‌యూ నాయకులు సింహాద్రి, జీవన్, పీవైఎల్ జిల్లా నాయకులు పరుశరాం, సునీల్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వేసవి శిక్షణను వినియోగించుకోవాలి



వాలీబాల్ క్రీడా శిబిరాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

అర్వపల్లి : ప్రభుత్వం విద్యార్థుల కోసం ఉచితంగా నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణను వినియోగించుకోవాలని కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్ కోరారు. శనివారం మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీ పాఠశాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్ ఉచిత క్రీడా శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా క్రీడల్లో శిక్షణ పొంది రాణించాలని కోరారు. జిల్లాకు మంజూరైన పది ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలలో తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్ ఉండటం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎంసీ చైర్మన్‌లు తండ లింగమూర్తిగౌడ్, బూర్గుల రాంబాబు, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేశ్వర్లు స్థానిక పాఠశాల పీఈటీ సైదులు, ఉపాధ్యాయుడు వర్దెల్లి కృష్ణ, పీఈటీలు కిరణ్, శ్రీనివాస్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి బీఆర్‌ఎస్ కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న రజాక్

మద్దిరాల : వచ్చే ఎన్నికలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఎస్‌ఏ.రజాక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి గ్రామంలో బూత్ ఇన్‌చార్జ్‌లను, ప్రతి 100ఓటర్లకు ఓ ఇన్‌చార్జ్‌ను నియమించనున్నట్లు తెలిపారు. అనంతరం అనారోగ్యంతో చికిత్స పొందడంతో మండల కేంద్రానికి చెందిన జక్కుల రాజుకు రూ.28వేలు, మండల పరిధిలోని ముకుందాపురం గ్రామానికి చెందిన ఎం.ముత్తిలింగంకు రూ.31,500వేలు, ఎం.సోమయ్యకు రూ.34వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు మంజూరు కావడంతో వారికి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కుందూరు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా నాయకులు గుడ్ల వెంకన్న, కన్న వీరన్నగౌడ్, సూరినేని నర్సింహారావు, పాతూరి లింగారెడ్డి, సర్పంచ్ అక్కిరెడ్డి జ్యోతి ఉపేందర్‌రెడ్డి, దామెర్ల వెంకన్న, ఎంపీటీసీ శిరంశెట్టి వెంకన్న, వడ్లాణం మధుసూదన్, కళింగారెడ్డి, మల్లు ఉపేందర్‌రెడ్డి, మధు, వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా చెన్నకేశవస్వామి తిరుకల్యాణం



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఆత్మకూర్–ఎస్ : మండల కేంద్రంలో శ్రీభూగోదా సమేత చెన్నకేశవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆరగింపు, తీర్థప్రసాద గోష్టి నిర్వహించారు. శనివారం నిత్యహోమం, బలిహరణము, మహాపూర్ణాహుతి, చక్రతీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో కారంపూడి అనంతాచార్యులు, నూగురు వెంకటరంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, రమాకాంత్, శ్రీకాంత్, వెంకటరంగాచార్యులు, అనువంశిక ధర్మకర్తలు సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, లింగారెడ్డి, సందీప్‌రెడ్డి, చెన్నకేశవ భక్తబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

బాషానాయక్ తండాలో కార్డన్‌సెర్చ్

సూర్యాపేట క్రైం: శాంతిభద్రతల పరిరక్షణకే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ సోమనారాయణ సింగ్ తెలిపారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్ పరిధిలోని బాషానాయక్ తండాలో శనివారం తెల్లవారు జామున కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. గ్రామంలో సరైన కాగితాలు లేని 24 ద్విచక్ర వాహనాలు, బొలేరో ట్రక్కు, ట్రాక్టర్ సీజ్ చేశారు. కార్యక్రమంలో రూరల్ ఎస్‌ఐ సాయిరాం, యాదవేందర్‌రెడ్డి, మధు, సైదులు, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నూతనకల్ : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. నూతన్‌కల్, పెన్‌పహాడ్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామానికి చెందిన యాకూబ్ టాటాఏస్ వాహనంలో మామిడికాయల లోడ్‌తో సూర్యాపేట వస్తున్నాడు. ఈ సమయంలో మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ గ్రామానికి చెందిన గట్టు రామయ్య టాటాఏస్ వాహనంలో సూర్యాపేట నుంచి తొర్రూర్ వెళ్తున్నాడు. కాగా, మండల కేంద్రంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే రెండు వాహనాలు ఢీకొనడంతో అందులోని ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

వాహనం బోల్తాపడి..

పెన్‌పహాడ్ : వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గాజులమల్కాపురం శివారులో శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపిన వివరాలు.. డ్రైవర్ దోరేపల్లి రామకృష్ణ తన అశోక్ లీలాండ్ వాహనంలో హైదరాబాద్ నుంచి మునగాల మండలం గణపవరం గ్రామానికి మామిడికాయల లోడ్ నిమిత్తం క్లీనర్ ఇంఢ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గాజులమల్కాపురం శివారులోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టింది. అందులో ఉన్న ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం కోదాడ ఆస్పత్రికి తరలించారు.

జూనియర్ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలి



పెన్‌పహాడ్: మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్యదర్శులు



చివ్వెంల : సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న సీపీఎం నాయకులు



అర్వపల్లిలో నిరసన తెలుపుతున్న కార్యదర్శులు

చివ్వెంల : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె శనివారం 9వ రోజు కొనసాగింది. ఈ సమ్మెకు సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. సమ్మెలో సీపీఎం నాయకులు వెల్పుల వెంకన్న, బచ్చలకూరి రాంచరణ్, పంచాయతీ కార్యదర్శులు కొప్పుల బక్కయ్య, గణపారపు మధు, బండారు పవన్‌కుమార్, బొల్లం అశోక్, రజినిరెడ్డి, సైదులు, అరవింద్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె ఆగదు

పెన్‌పహాడ్ : తమను రెగ్యులరైజ్ చేసే వరకు సమ్మె ఆగదని పలువురు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జేపీఎస్‌లు శనివారం మోకాళ్లపై నిలబడి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి గ్రామాల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ తమ పట్ల ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సమ్మెలో రమేష్, దివ్యభారతి, రాజేష్, చంద్రశేఖర్, సతీష్, సంజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : తమను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మె శనివారం 9వరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్యదర్శులను క్రమబద్ధీకరించాలని గ్రామ అభివృద్ధిలో ప్రభుత్వం తరుపున పనిచేస్తున్న తమను నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. గ్రామాల్లో కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు నాతి రమేష్, మంగ, మహేష్, రేసు తరుణ్, ఉమ, లలిత, పుష్ప, తేజశ్రీ, విజయేందర్, రాజు పాల్గొన్నారు.

9వ రోజుకు చేరిన సమ్మె

అర్వపల్లి : జేపీఎస్, ఓపీఎస్‌లు తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన శాంతియుత నిరవధిక సమ్మె శనివారం 9వరోజుకు చేరింది. ఈ సమ్మెకు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవులపల్లి నవీన్‌రెడ్డి, కార్యదర్శులు నారాయణమూర్తి, నెహ్రూనాయక్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరాజు, జ్యోతి, మహాలక్ష్మి, ఫర్హాన, కావ్య, మాధవిక పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి

నూతనకల్ : జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె శనివారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాలుగా ప్రొబేషనరీ సమయంలో విధులు నిర్వహించి గ్రామాల అభివృద్ధికి కృషి చేశామని వారు తెలిపారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో ప్రముఖ పాత్ర పోషించి గ్రామాలను సర్వతోముఖాభివృద్ధిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర వహించిన తమను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంగరాజు, మధుసూదన్‌రెడ్డి, వెంకన్న, వినోద, వెంకట్‌రెడ్డి, సత్యవతి, ఉమేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను దగాచేస్తున్న తెలంగాణ ప్రభుత్వం



మాట్లాడుతున్న కొమ్ము అంజయ్య

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం దళితులను అన్ని రంగాలలో దగా చేస్తుందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు కొమ్ము అజయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ దళితుడిని సీఎం చేస్తానని మాయమాటాలు చేపి దళితులను మోసం చేయలేదా అని ప్రశ్నించారు. మంత్రి వర్గంలో ఏ ఒక్కరైనా దళిత మంత్రి ఉన్నారా అన్ని గుర్తు చేశారు. అంతే కాకుండా దళితులకు 3ఎకరాల భూమిని ఇస్తానని పట్టించున్న దాఖలాలు లేవన్నారు. ఏ ఒక్కరి కూడా ఇళ్లను కట్టించలేదన్నారు. 8సంవత్సరాలు దాటినా మద్దిరాలలో డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇంత వరకు పంపిణీ చేయలేదన్నారు. ఎమ్మెల్యే ఇసుక మాఫీయా, లాండ్ మాఫీయా చేస్తుంటే బీఆర్‌ఎస్ నాయకుల కళ్లకు కనిపించడం లేదా అని అన్నారు. త్వరలోనే బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగ్గిన బుద్ధి చెప్పే రోజులు వస్తున్నాయని అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల నాయకులు పాల్వాయి పరుశరాములు, కొమ్ము వెంకన్న, పాల్వాయి వీరభద్రం, దామెర్ల సోమయ్య, మరికంటి వెంకటరాములు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దు



కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్ పరిశీలిస్తున్న తహసీల్దార్ యాదగిరిరెడ్డి

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లలో నిర్వాహకులు ఎలాంటి జాప్యం చేయొద్దని తహసీల్దార్, మండల నోడల్ అధికారి పి.యాదగిరిరెడ్డి సూచించారు. శనివారం మండలంలోని కొమ్మాలతో పాటు వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం ఎగుమతుల్లో లారీల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని శుభ్రం చేసి తేమ లేకుండా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట కేంద్రాల నిర్వాహకులు, వీఆర్‌ఏలు, రైతులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాబృందం సభ్యులు

నూతనకల్ : సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ ప్రసాద్ కోరారు. శనివారం మండల పరిధిలోని తాళ్లసింగారం గ్రామంలో ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాల మేరకు రోడ్డు నియమ నిబంధనలు, షీటీమ్, సైబర్ నేరాలపై కల్పించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పోలీసు కళా బృందం మహిళల భద్రత, మానవ అక్రమ రవాణా, లింగవివక్షత, 100డయల్ తదితర అంశాలపై కళాజాతా రూపంలో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చూడి లింగారెడ్డి, ఎంపీటీసీ తండు సంధ్యశ్రీనివాస్, షీ టీమ్ ఏఎస్‌ఐ పాండునాయక్, జాఫర్, ఎల్లారెడ్డి, శ్రీనివాస్, కళాబృందం ఇన్‌చార్జ్ ఎల్లయ్య, గోపయ్యచారి, నాగార్జున, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులు స్వాహా

పెన్‌పహాడ్ : ఓ మల్టీపర్పస్ వర్కర్ పంచాయతీ నిధులను స్వాహా చేశాడు. ఈ ఘటన మండల పరిధిలోని దోసపహాడ్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం ...గ్రామంలో మల్టీపర్పస్ వర్కర్‌గా పని చేస్తున్న శనగాని సతీష్ నిబంధనలకు విరుద్ధంగా డిమాండ్ నోటీస్ అందజేసి ప్రజల నుంచి ఇంటి పన్నుతో పాటు వివిధ రూపాల్లో పన్నులను రశీదు లేకుండా సేకరించాడు. ఆ నిధులను గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమచేయకుండా తన సొంత అవసరాలను వాడుకున్నాడని ఆరోపించారు. అధికారులకు సంబంధం లేకుండా నిధులు సేకరించి దుర్వినియోగానికి పాల్పడిన వర్కర్‌పై చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ విషయమై ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్‌ను వివరణ కోరగా నిబంధనలకు విరుద్ధంగా పన్నులను వసూలు చేసి సొంత ఖర్చులకు వాడుకున్నట్లయితే విచారణ జరిపి సంబంధిత వర్కర్‌పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కంఠమహేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం

ఆత్మకూర్–ఎస్ : మండల పరిధిలోని మక్తాకొత్తగూడెం గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీకంఠమహేశ్వర స్వామి సురమాంబదేవి కల్యాణ మహోత్సవాలు గత మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గౌడ కులస్తులు కుటుంబసమేతంగా కంఠమహేశ్వరస్వామి గుడి వద్దకు జలబిందెలతో వెళ్లి అభిషేకం నిర్వహించారు. శనివారం కంఠమహేశ్వర స్వామికి బోనాలు సమర్పించి, రాత్రి స్వామివార్ల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దగౌడ్ కాసాని హన్మంతుగౌడ్, సొసైటీ అధ్యక్షులు కాసాని సత్తయ్య, చామకూరి ఉప్పలయ్య, వంగాల లింగయ్య, మట్టపెల్లి లింగయ్య, చామకూరి మల్లయ్య, నందరపు పిచ్చయ్య, శ్రీను, సైదులు, గౌడకులస్తులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని మహిళ ఆవేదన

సూర్యాపేట : తన ప్లాట్‌ను ఆక్రమించుకొని చంపుతానని బెదిరిస్తున్న వ్యక్తి నుంచి కాపాడి తనకు న్యాయం చేయాలని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. వివరాల ప్రకారం.. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన బండ్ల శైలజకు 2008లో ఇందిరమ్మ కాలనీ ఫేస్ త్రీలో అమృత్ పార్క్ పక్కన గల సర్వే నంబర్ 293, 300, 301, 303లో గల 338వ ప్లాట్‌ను కేటాయించారు. శైలజ భర్త చనిపోవడంతో ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు కావడంతో ఆర్థిక స్థోమత లేక ఇల్లు కట్టుకోలేక ప్లాట్‌ను ఖాళీగా ఉంచింది. ఇదే అదునుగా ఖాళీ స్థలాన్ని చూసిన ఆత్మకూర్ (ఎస్) మండలం ఏపూర్ గ్రామానికి చెందిన నవిళ్ల భద్రయ్య అనే వ్యక్తి శైలజ ప్లాట్‌ను ఆక్రమించుకొని స్థలంలో పిల్లర్లు పోశాడు. శైలజ మా ప్లాట్‌లో ఇల్లు కట్టవద్దని నాలుగు నెలలుగా బతిమిలాడినా వినకుండా చంపుతామని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. మేము రెవెన్యూ అధికారి నుంచి ప్రస్తుతం డిక్లరేషన్ తీసుకొని ఉన్నామని అనడంతో ఎవరికి చెప్తావో చెప్పుకోపో అంటూ దుర్భాషలాడుతూ బెదిరిస్తున్నారని, దీంతో చేసేదిలేక మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో టౌన్ ప్లానింగ్ అధికారి రావడంతో అతడిపై దాడి చేశారని తెలిపింది. జిల్లా అధికారులు చొరవ తీసుకొని మా ప్లాట్ మాకు ఇచ్చే విధంగా న్యాయం చేయాలని అధికారులను కోరారు. ఆమె వెంట ముబీన, రుబీన తదితరులు ఉన్నారు.



స్థల పత్రాన్ని చూపుతున్న బాధిత మహిళ